అనగనగా — ఓ మహారాజు: ఆయనకు వలమాలిన రాజ్యం.

ఆ రాజ్యంలో ఎన్నడూ అతివృష్టి లేదు, అనావృష్టి లేదు: ప్రజలకు ఏ యీతిబాధలూ లేవు.

ఏలేమహారాజుకు ఏమీపని లేదు- ప్రొద్దు పోవడం లేదు.

చూసిచూసి ఏమీపాలుపోక, చివరికి ఒకనాడు మహామంత్రికి కబురుచేశాడు, ఉన్నవాడున్నట్టుగా వచ్చి దర్శనం చేసుకోమని.

ఒక్క క్షణంలో జవాబు వచ్చింది - రానని -
ఎందుచేత? - మహారాజే స్వయంగా బయలుదేరి వెళ్ళాడు, కనుక్కుందామని

గుమ్మంలో కూచుని, నిశ్చింతగా జంధ్యాలు వడుక్కుంటూ ఉన్నాడు ఆ బ్రాహ్మడు -

'ఏం మహామంత్రీ!'

'నన్ను ఆ పేరున పిలవద్దు!'

'ఏం? -'

'సిగ్గు చేటు!'

'నీకా - నాకా!'

'ఉభయులకూ! - నాకు ఏడు వెనకల పుట్టిన ప్రతికుల మంత్రీ-కార్య కలాపాల్లో మునిగి తేలుతూ, - దిగంత విశ్రాంత యశో విరాజితుడౌతూంటే - నేను గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోనా - ఏదీ, వేలుమడిచి చెప్పండి - మీ హయాములో, ఒక్క యుద్ధం వచ్చిందా. ఒక్క ఉపద్రవం వచ్చిందా? -'

'అది నా తప్పంటావా?'

మంత్రి భగ్గుమన్నాడు. 'నిర్మొగమాటంగా చెప్పాలంటే - అనక తప్పదు -! పరరాజులున్నారంటే వాళ్ళకేం మనమీద జాలా, దయా? - కవ్వించండీ, కజ్జాకు కాలు దువ్వుతారా? - అదిమీకు చేతకాదాయెను

ఏ రాజ్యంలోనన్నా చూడండీ-ఎప్పుడూ కన్నుల పండువుగా, గత్తరగా గందరగోళాలే కద.

అటునుంచి ఆరాజు దండెత్తడనడం - ఇటునుంచి యీరాజు దండెత్తడనడం - మంత్రి కలుగజేసుకోవడం - ఎత్తుపై ఎత్తు వేయడం - అందితే తన్నడం - తప్పితే తినడం - యీముచ్చట ఒక్కనాడన్నా నాకు తీరిందా? -

'ఎందుకండీ ఈ ఉద్యోగం -నా నేతాను-' అన్నాడు ఖండితంగా- 'సరే!' అన్నాడు, మహారాజు వినయంగా. మంత్రి ఒడుపులో కదురు మరింత విశృంఖలంగా తిరుగుతూంది: చూసి చూసి, -

మహారాజు మనసు గుక్క పట్టింది. తోచీ తోచని మహారాజు యిటుమళ్ళి, అడుగులు లెక్క బెట్టుకుంటూ వస్తున్నాడు. దోవ పేలి, కాలువగట్టు చుట్టుకుంది. కాలిబాట నలిగినలిగి చేలో దుబ్బుల్లో కలిసిపోయింది.

— మడి దున్నుకుంటూన్న వాణ్ణి, మరి యీదగా పలుకరించాడు మహారాజు.

'నీ పేరేమిటయ్యా!'

'వెంకయ్యగారి సుబ్బయ్యా!'

'ఈ చేను ఎవరిది?'

'మాపిల్లది -'

'అదేం?'

మల్లాది రామకృష్ణశాస్త్రి

దున్నే ఆసామి ఎగాదిగా చూసి - 'నీకు పెళ్లి కాలేదా? -' అన్నాడు - 'ఊహుఁ -' అన్నాడు మహారాజు నిలువునా.

'అయితే బిడ్డలున్న సుఖం నీకేమెరిక? -'

- నాగలి సాగుతూంది:

మహారాజుకు రోషం వచ్చింది - అతి ఆలోచనమీద అన్నాడు -

'ప్రజలందరూ నాబిడ్డలే!' - రైతు, ఓరకంట పరకాయించాడు.

'నీవేం - భూదేవ్వా?'

'మహారాజును -!'

'అంటే...ఏంపని చేస్తావ్!'

'రాజ్యం చేస్తాను!'

'రాజ్యం చేయడమంటే - ? - అదేదో కొత్తవిద్దెలాగుంది. ఏమో నాకెందుకులే - నీదారిన నీవుపో! - అంక ఆగుంది -'

- మహారాజు పెదవి విరిచి చక్కాబోతున్నాడు - పోయిపోయి మళ్లీ పట్నంలోకి జొరబడ్డాడు.

ఒక అరుగుమీద, అప్పుడే సుష్టుగా భోంచేసిన గెస్తు బాసెపట్టు వేసుకుని, తాంబూలం తబుకు ముందుంచుకొని, మునిగోర ఈనెలు సుతారంగా గిచుతూ, కడుపులో ప్రసన్నతా కలిసికట్టుగా. కూనిరాగం తీస్తూ కూర్చొని ఉన్నాడు. మహారాజు ఆయింటిముందు ఆగాడు. ఒక్క అడుగు ముందుకు వేసి, - అంచాయించి, అంతలో దర్పం తెచ్చుకుని, అహంకారం ఉట్టిపడేట్టు మరో అడుగు ముందుకు వేశాడు గెస్తు, మహారాజును చూసీచూడనట్టు చూసి, - 'ఎవరో పరదేశి వచ్చాడు!' అని, యింట్లోకి పొల్లుకేక పెట్టి - 'పోయి స్నానం చేసి భోంచేయి!' అని, యిటో ఉరుము ఉరిమి, - రాగం సాగించాడు. ఇదంతా ఆగడం అనుకున్నాడు మహారాజు! -

'నేనెవరో తెలుసునా?'

'అనవసరం!. వేళపటున వచ్చావ్! - ఉన్నదేదో కలో - గంజో - త్రాగుతావు. అంతగా అయితే ఓ గడియసేపు నడుం వాలుస్తావ్! - నీదోవను నీవు చక్కా బోతావ్! —'

'నేను - మహారాజును!'

'నేనూ-అంతో ఇంతో ఓ మహారాజునే. మాతండ్రి కడుపు చల్లగా - నాకడుపు చల్లగా - ఉన్నంతలో యింతవరకూ ఏలోటూ లేకుండా రోజులు వెళ్ళమారిపోతున్నాయ్. పద, - అలాగే నిలుచుంటావేం? - అపరాహ్ణమైంది! —'

మహారాజుకు తన్ను తానెరుగనంత రోషం వచ్చింది!- చర చర నడిచి పోతున్నాడు. గెస్తు, ఒక్క నిముషం నిదానించి,— ఒక్క అంగలో, - సరసకు దుమికి జబ్బపట్టుకు నిలవేసి - 'ఏమిటీ ఓ గాయిత్యం! - ఈ మిట్ట మధ్యాహ్నం అప్పుడు అభాస చేయడానికి వచ్చావా భిడవా! - పద—' అడోపున రెక్క పట్టుకు తీసుకువెళ్ళి, - మడికట్టించి తానుదగ్గిర కూర్చుని భోంచేయించాడు. భోజనంఅయిన తరువాత,- కంకటి వాల్చి,- బొంత తల క్రిందకు యిచ్చి,- ఓ ఝాముసేపు కునుకమన్నాడు: ఝాము కాగానే కొట్టినట్టు లేపి కూర్చోబెట్టాడు: కాళ్ళూ చేతులూ కడుక్కోమని ఉదకం యిప్పించి, దోసెడు పేలపిండీ బెల్లంగడ్డా తినిపించాడు: పోతులాంటి చక్రకేళీపండు వలిచి చేతికిచ్చాడు: పట్టు బలవంతాన తిన్న తరువాత,- ఇహ నిలవలేక - 'ఎళ్ళివస్తాను' అన్నాడు మహారాజు. 'మంచి!' దన్నాడు గెస్తు. వెనుతిరిగి చూసుకుంటూ వెళ్ళిపోతున్నాడు మహారాజు. గెస్తు ఈవంక చూడనైనా చూడలేదు—

హరహర! మహాదేవ! ఫొటో :—జి. ఎస్. భూషణ్, (మద్రాసు).

స్వస్తిక

కోటలో హంసతూలికా తల్పంమీద,- తెల్లవార్లూ కునికిపాటన్నా లేకుండా కూర్చుని ఉన్నాడు. తొలికోడికూత విని లేచి,- కోట నలుమూలలా కలయ దిరిగాడు: తన్ను పలుకరించేవారూ లేరు,- తాను పలుకరించేవారూ లేరు - ఆలానంలో పట్టపేనుగు,- కుంభంబగోస్థిలో ఉంది. తాను అటూ వెళుతూంటే ఓరగంట - చూసీచూడనట్టూ,- రవంత జోహారు చేసింది: మందురలో ఉత్తమాశ్వాలన్నీ - కట్టు పగ్గాలలో నే,- పట్టపగ్గాలులేని పరవడిమీద ఉన్నాయ్: మహారాజుకు మర్యాద చేయాలన్న ధ్యాసే ఉన్నట్టులేదు—

తొలినాడు ఏ వీరుడో విజయాంకంగా ప్రతిష్ఠించిన వీరధ్వజం దగ్గిర నిలుచుని,- ధర్మఘంటికను మ్రోగించాడు మహారాజు. కొంతసేపటికి కొందరు పౌరులు తీరుబడిగా, ఆ ప్రాంతాన గుమికూడారు!

'మాకు యీ రాజ్యం అక్కరలేదు!' అని గర్జించాడు మహారాజు! అందరూ మౌనంగా - ఉన్నారు:

'మేము, దేశం విడిచి వెళ్ళిపోతున్నాం!'

అందరూ మౌనంగా - విన్నారు!

ఆ శిలా ప్రతిమల నన్నింటినీ ఒక్కసారి పరకాయించి, మహారాజు,- తన త్రోవ తాను చూసుకున్నాడు - పోగా పోగా -

ఎదురుగుండా - ఎవరో పండు ముదుసలి పడుచువాడికన్న ధూకుడుగా వస్తూ వస్తూ,- మహారాజుకు, రాచుకున్నంత దగ్గిరగా వచ్చి,-ఆగి, - 'ఎక్కడికి?' అన్నాడు; మహారాజు ఆగకుండానే - 'అక్కడికి!-' అన్నాడు:

'అక్కడకోసం ఎక్కడికో పోవడం ఎందుకు? ఎక్కడబడితే అక్కడేఉంది!-'

'ఉందని తెలియకనే!-'

'తెలిసినా అందుకోలేకనే-'

'ఉనికికి అందలేదు!-ఊహకు అందింది!'

'పూచిన పూవల్లా కాయగాదు! కాచిన కాయల్లా పండుకాదు-'

'వెదికితే అందనిది - తానై వెదుక్కుంటూ రావాలి!-'

'అందుకు - వేయి జన్మల తీరుబడి కావాలి!'

'మన చేతకానిది - మనసుకు నేర్పావు!'

—మహారాజు-పకపక నవ్వుతున్నాడు- వినికిడే మాయమైంది. వెన్నాడిన కాంతి మాయమైంది! అడుగడుగుకూ కోలాహలంగా, ఒక వసంతం చిగిరించుతూంది - మరో వసంతం పొగరెక్కుతూంది.

ఎన్ని వసంతాలుగానో,- మత్తా - సత్తా నిలుపరించుకున్న కోదమ తుమ్మెదలు,- ఏరీ కోరీ, నిలువచేసుకున్న ఆసవాలన్నీ మహారాజుమీద ప్రదిమ్మరించినవి! ఏడు రంగులు పొంగి ఏక సంద్రమైపోగా,-మహారాజు-నిలువు నిలువూ కరిగి మనసై- మనసు మరిగి మంత్రాక్షరై-మంత్రాకుర మినుకుమని నిలిచిన ఒక్క తేనెచుక్క,-చీకటికి వెలుగు కమ్మిన తెరలు చీల్చుకు జారబడ్డది - అలనాటి అనంతంలోకి—

రోమక సామ్రాజ్యంలో—

యుగాలు పుట్టకముందు పుట్టిన వెలుగు కదలక మెదలక పదునెక్కి - జ్యోతిగా శబలించింది!—

తాను కదిలింది - తపస్సులో మునిగి తేలుతూన్న ఋషులను కదిలించింది.

ఏసునాథుడు ఉదయించాడు:

వస్తున్న ఋషులలో, ఒక్కరికి - అనుగు ముందు పడలేదు:

'బిడ్డ పుట్టినవేళ మంచిది కాదు! ఆ తల్లి లక్షణంగానే పురుడుపోసుకుంది. కాని,- ఎన్నెన్ని ఎన్నివేలమంది బిడ్డలనో పొట్టబెట్టుకుంటుంది - ఆ రాకాసి బిడ్డమొగం చూడను!' అన్నాడు ఋషి.

'రాకాసి బిడ్డ కాదు - లోకరక్షకుడు!' అన్నారు తోటి పెద్దలు!—

'తన్ను తాను రక్షించుకోలేనివాడు - లోకానికేం రక్షకుడు!'

ఎట్టకేలకు—

ఏసునాథుడు - శిలువమీద బలియిచ్చుకుంటూ—

'తండ్రీ! - అజ్ఞానులు! అందరినీ

క్షమించు -!' అని మననం చేశాడు:

శిలువజాడల్లో జాగరణ చేస్తున్న రుషి,- కరుకు పీరుడిగొంతుతో మౌనంగా మంద లించాడు:

అహంకారం అంతం చేసుకునేందుకు ఒక్క జన్మచాలలేదా తండ్రీ!—

పాపులు వేరా - ప్రభువు వేరా?—

తండ్రికి పెద్దకొడుకువై పుట్టి - తమ్ము లను చిన్నచూపు చూస్తావా?—

మరణించేందుకే అవతరించిన వాడవు - నీవు మిగులవు!—

శిలువ మిగులుతుంది - వెనుదిరిగి చూసుకో - మాకూ నీకూ విమోచనకోసం- మరి కొన్ని యుగాలు మననం చెయ్యి—!

ఏసునాధుడు - నిశ్చింతగా అస్తమిం చాడు— * * *

శాక్యముని, పద్మాసన ముద్రలో మన స్సులో సంక్షోభానికి రూపకల్పన చేసు కుంటూ - తనతో తాను సంకుల సమరం చేస్తున్నాడు: మనస్సు పరిపరివిధాల, నార వధువులై,- గగ్గోలుగా నాట్యం చేస్తూంది - ధ్యానభంగమైంది - ఎదుట ఆడుతూన్నది - యశోధర - పాడుతూన్నది - యశోధర - కవ్వింపుగా కనుగీటేది, - యశోధర—

'నేను, తరించాలి!' అని హుంక రించాడు, అన్ని ముద్రలూ విదిలించు కుంటూ గౌతముడు:

'నేను - వరించినప్పుడే తరించాను' అన్నది రాహులమాత.

'అయితే - వదలిపో -'

'వదలిపోయినా - వదిలించుకోలేని అను బంధం!

అమాయకులుగా పెరిగినందుకు,- అర్థం కాని దుఃఖం కబళించింది: వేదనలూ యాత నలూ బ్రతుకైన లోకంలో,- తమ కొక్క రికే శాంతి,- తమ కొక్కరికే నిర్వాణ పథ ప్రాప్తి కావాలని తపించడం, తలక్రిందులు చేసే రాజసంకాని, తరణోపాయం కాదు. అని ఆర్యపుత్రులకు మనవి!'—

గౌతముడు తొణకడు-'దుఃఖం యాతన లేని సుఖం. తలితండ్రులను క్రిందగే రాకాసి బిడ్డ - అన్యోన్యంమాలి, శూన్యం కోసం చేసే సాధనలు ఫలిస్తే జగతికి క్షేమం కాదు-' ప్రబుద్ధుడు - గౌతముడు, శాపం విడిచిన విశ్వామిత్రుడైనాడు. యశోధర - మధురమూర్తులు, శరణు లేక, మరగిపోయినవి.

* * *

మధురలో—

వంచిన తల ఎత్తకుండా, తన దోవను తాను పోయే కుబ్జను కృష్ణుడు కవ్వించి నిలి పాడు.

'ఎవరీ సుందరి!'

'నందుని మందలోనిది-కాదు-'

'సంతరించిన గంధమాల్యాలు?'

'సంహరించే రసికుడికి!'

—పెనుగులాట లేకుండానే దోచుకో నిచ్చింది కుబ్జ: కృష్ణుడు ఆమెకు, తన చేత నైన వరమిచ్చాడు: శ్యామసుందరుడి కను పాపల్లో, అలముకుంటూన్న అందం మ్రాగ న్నున నిర్లక్ష్యంగాచూసి, నిలువకుండా, పిలుపందని దూరంగా పోతూ, - జాలిగా అనుకున్నది:

'కురూపికి రూపసంపద?-ఎవరి మక్కువ తీరనో? - నాలుక మోసేదాన్ని, మన్మథ బాణం కాలేను-' * * *

అలనాడు-

రాతిని నాతిగా చేసినందుకు గౌతముడు వినమ్రుడైనాడు రఘురామునికి: మళ్ళీ మెత్తబడుతూ పాషాణి రోషంతో వణికి పోయింది!

'తల్లిలేని బిడ్డనని ధరణి ఆదరించింది. నగ రాజు కనికరించి తన రూపు యిచ్చాడు. తరించాలని ఎన్నడూ తపస్సు చేయలేదే!- ఎందుకయ్యా ఇన్నేళ్ళకు అవతరించి పాద ధూళితో బ్రతిమాలావు!-దేవరాజుకు, మరో వేయి దీవెనలకా?-ఇదా నీ ఉద్ధరింపు!'—

శబరి అందిచ్చిన పండ్లు-చవిచూసి సమ ర్పించిన పళ్లు శ్రీరామచంద్రుడు కళ్ళకు అద్దుకున్నాడు: అహల్యకు తాను చేసిన అపకారం అప్పటికి అర్థం అయింది—

—మహారాజు-నడచిపోతూ, అడుగు పడేలోపల, అందనిది తనకు అక్కరలేదని అర్థం చేసుకున్నాడు: నిశ్చింతగా తిరిగి వచ్చి, అంతఃపురంలో నిద్రలేచాడు: వందిమాగధులకై వారాలు మార్మోగు తున్నాయి-

'నాకెందుకీ కైవారాలు: నాకెందుకీ వైభవం!- నేనూ మీలాటి మనిషినే!-' అన్నాడు మహారాజు.

'ఎన్నటికీ కానియ్యం! - మీరు మహా రాజులే!' అని ఆజ్ఞాపించారు ప్రజలు:... మహారాజు నవ్వు ఆపుకోలేక పోయినాడు

పరాభి

నిత్యమ్ము ప్రణయ భృత్యమ్ముసలిపి,
రచియించి చనుల మకరాంకునిలిపి,
ముద్రించి ముద్దుపయి ముద్దు, వింత
యందాలకుప్పయని దేహమంత,
పెరవారికంట పడకుండురీతి
పరిరంభణమున బంధించిప్రీతి,
ప్రాణాధిపు డుపలాలించుచుండ,
స్వానందసుధల భాండమ్మునిండ,
సంతోషితాత్మ, స్వాధీనపతిక;
రమణీయ నవ్య లావణ్యలతిక.
రాత్రింబవళ్లు రతిదేవి మోజ,
కావించుచుండి కందర్పపూజ,
తన జీవితమ్ము తగనాటపాట
నిష్కంటకమగు కుసుమంపుబాట,
తన నోముఫలము, ఏలాటిఅతుకు
లేనట్టి మంచి బంగారు బ్రతుకు,
ఆనందసరసి రాయంచసరణి,
విహరించుచుండి మోహాలభరణి,
సంతోషితాత్మ, స్వాధీనపతిక;
రమణీయదివ్య లావణ్యలతిక.

మిథునమ్ము తిరుగు పథసీమ సతము
చీకట్లులేక జ్యోత్స్నాభరితము,
హసియించునపుర, తమనవ్వుతోడ
పులకించి సర్వ భువనాలుకూడ,
ఈ దంపతులకు ఏకమ్ము లోని
ప్రాణమ్ము, దేహములు వేరుకాని;
మధువందు తియ్యదనమట్లు, అలరు
లో తావిపగిది, ప్రియునాత్మనలరు,
సంతోషితాత్మ, స్వాధీనపతిక;
రమణీయదివ్య లావణ్యలతిక.
ఆనందగగన మందుద్భవించి
నటువంటితార, సుఖపున్ విపంచి,
ప్రాణాధిప ప్రణయమద్యమత్త,
ఉద్యాన విహరణాసక్తచిత్త,
పరితోషజలధి పగడాలదీవి,
శోకమ్ము కనని సుఖపూర్ణజీవి,
తనకన్నుసనల దాస్యమ్ముప్రాణ
పతిచే ముదమున చేయించుజాణ,
సంతోషితాత్మ, స్వాధీనపతిక:
రమణీయనవ్య లావణ్యలతిక.